క్లుప్తంగా

నేటి జిల్లా వర్క్ షాప్ జయప్రదం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని బద్వేల్ పట్టణంలోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం జరిగే డీవైఎఫ్‌ఐ జిల్లా వర్క్ షాప్‌ను జయప్రదం చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివ కుమార్ తెలిపారు. గురువారం నగరంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ బద్వేలులో జరిగే డీవైఎఫ్‌ఐ వర్క్ షాప్‌లో భవిష్యత్ కార్యక్రమాల గురించి చర్చిస్తామన్నారు. ప్రధానంగా రాష్ట్ర విభజన హామీలు అమలు, కడప ఉక్కు ,రాయలసీమకు బుందేల్ఖండ్ తరహా ప్యాకేజీ, నిరుద్యోగ సమస్యల గురించి, జిల్లా అభివృద్ధి గురించి ఈ వర్క్ షాప్ లో చర్చించి భవిష్యత్ కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు.

ఆర్థిక సాయం



నర్సింగ్ విద్యార్థికి ఆర్థికసాయం అందజేస్తున్న బాసట సంస్థ ప్రతినిధులు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన బాసట స్వచ్ఛంద సేవా సంస్థ గురువారం విద్యార్థి చదువుకోసం బాసటగా నిలిచింది. నగర శివార్లలోని మగ్దూం సాహెబ్ కొట్టాల గ్రామానికి చెందిన సౌభాగ్య స్థానిక రవీంద్ర నగర్‌లోని శ్రీనివాస నర్సింగ్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతోంది. కళాశాల ఫీజులు, పరీక్ష ఫీజులు, ఇతర ఖర్చులకోసం ఆమె బాసట సంస్థను ఆశ్రయించింది. సంస్థ ప్రతినిధులు మేరువ బాలాజీరావు, ముఖ్య ప్రతినిధి కార్తీర్‌రెడ్డి ఆమె చదువుల కోసం రూ. 27,500 చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ ఇన్‌చార్జి వీసీ నియామకంపై అభ్యంతరాలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా ఆచార్య కె. కృష్ణారెడ్డిని నియమించడం పట్ల పలు విద్యార్థి సంఘాల నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వైవీయూ ప్రిన్సిపాల్‌గా ఉన్న సమయంలో మహిళా ఉద్యోగినితో అసభ్యంగా వ్యవహరించి సస్పెన్షన్‌కు గురయ్యారని, అలాంటి అధ్యాపకున్ని ఇన్‌చార్జి వీసీగా ఎలా నియమిస్తారని రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మల్లెల జగదీష్ ప్రశ్నించారు. ఎంతో గౌరవ ప్రదమైన వైస్ చాన్సలర్ పదవిలో ఆరోపణలు ఉన్న వ్యక్తిని నియమించడం సరికాదని, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ తక్షణమే స్పందించి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలు విశ్వవిద్యాలయ ప్రతిష్టను దిగజార్చడమేనని ఆయన పేర్కొన్నారు. లేనిపక్షంలో విశ్వవిద్యాలయ బంద్ ప్రకటించి, నిరాహారదీక్ష చేపడతామని ఆయన హెచ్చరించారు.


ఆచార్య కృష్ణారెడ్డికి సన్మానం



ఆచార్య కె. కృష్ణారెడ్డికి అభినందనలు తెలుపుతున్న అధ్యాపకులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా నియమితులైన ఆచార్య కె. కృష్ణారెడ్డిని పలువురు అధ్యాపకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం సాయంత్రం విశ్వవిద్యాలయంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో పలువురు అధ్యాపకులు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్య ఎం.వి.శంకర్, డా. వి. రామకృష్ణ, డా. సుభోష్, డా. వసుగోవర్ధన్‌రెడ్డి, డా. ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎంఈఓ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలి



ఆర్‌జేడీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని వివిధ మండలాల్లో పదవీ విరమణ పొందిన మండల విద్యాశాఖాధికారుల స్థానంలో పదోన్నతుల ద్వారా రెగ్యులర్ ఎంఈఓలను భర్తీ చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు బిల్లా హరిప్రసాద్ కోరారు. ఖాళీ అయిన ఎంఈఓల స్థానంలో ప్రధానోపాధ్యాయులు, ఇతర మండల విద్యాశాఖాధికారులు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారని, దీనివల్ల వారిపై పని భారం ఎక్కువై తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. ఈ విషయమై గురువారం పాఠశాల విద్య ఆర్‌జేడీ శామ్యూల్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సివి రమణ, ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు బత్తుల చంద్రశేఖర్, యడాల సురేష్ కుమార్, సుబ్బారెడ్డి, శంకర్ రెడ్డి, వెంకటరమణ, శివశంకర్, సమీర్ భాష, నాగరాజు, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలు.. ప్రజలకు ఇక్కట్లు

- పెరిగిన కూరగాయల ధరలు
- అల్లం ధర పైపైకి
- మండుతున్న బీన్స్, చిక్కుడు ధరలు
- సామాన్యులకు భారంగా ధరలు
- బెంబేలెత్తుతున్న వినియోగదారులు

కడప అగ్రికల్చర్: ఏం కొనలేం... ఏం తినలేం అన్నట్లుంది సామాన్యుడి పరిస్థితి. చికెన్, మటన్‌లతోపాటు కూరగాయల ధరలు కూడా కొండెక్కాయి. కిలో చికెన్ ధర రూ. 200 పైనే ఉండగా మటన్ ధర కిలో రూ. 750 నుంచి 800 వరకు ఉంది. ఈ రెంటింటి ఖర్చు తగ్గించుకుందామంటే కూరగాయల ధరలు కూడా మండుతున్నాయి. దీంతో సామాన్య, మధ్య తరగతులకు చెందిన జనాలు బెంబేలెత్తుతున్నారు.

- కూరగాయల ధరలు ఏది తీసుకున్నా దాదాపు కిలో రూ. 50 పైగానే ఉంటున్నాయి. మూడు నెలల నుంచి అల్లం ధర తగ్గకుండా ఉంది. కిలో అల్లం ధర రూ. 180 పలుకుతోంది. అలాగే క్యారెట్ కిలో రూ.85 ఉండగా, బీన్స్ కిలో రూ. 90, క్యాప్సికం, చిక్కుడు కాయ కిలో రూ. 70, బంగాళదుంప, టమోటాలు, మునక్కాయలు కిలో రూ.60 పలుకుతున్నాయి. కాలీఫ్లవర్ కిలో రూ. 56, క్యాబేజీ, అలసందలు, మట్టికాయలు, బీట్‌రూట్ కిలో రూ. 50 , ముల్లంగి కిలో రూ. 44, మిరపకాయ, వంకాయి, దొండకాయలు కిలో రూ. 40, బీరకాయ, కాకరకాయ, దోసకాయలు కిలో రూ. 35, బెండకాయ కిలో రూ. 25 ధర ఉన్నాయి. కాగా కొద్ది రోజుల క్రితం టమాటా ధర అమాంతంగా కిలో రూ. 100 పలికింది. తర్వాత తగ్గుతూ కిలో రూ.80.. ఆ తర్వాత రూ. 65.. ఇప్పుడు రూ. 60కి చేరింది. మిర్చి ధర కూడా క్రమేపీ పెరుగుతోంది. ప్రస్తుతం కిలో రూ. 40 ఉంది. ప్రభుత్వం వెంటనే కూరగాయల ధరలు తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.



కడప రైతు బజార్

ప్రభుత్వం ధరలు తగ్గించాలి



కూరగాయల ధరలు పెరిగాయి. టమాట, పచ్చి మిరప కాయల ధరలు కూడా పెరిగాయి. ఈ రెండు ధరలన్నా తక్కువగా ఉంటే పచ్చడన్నా తినేందుకు వీలుటుంది. కానీ అవి కూడా ధర ఎక్కువు ఉన్నాయి. ఏం తినాలో ఏమో. - శాంతమ్మ, లోహియానగర్, కడప

బీన్స్, అల్లం ధర తగ్గనేలే...



గత నెల రోజుల నుంచి బీన్స్ ధర తగ్గడం లేదు. మొన్నటి వరకు కిలో వంద రూపాయలు కూడా పలికింది. ఇప్పుడేమో కాసింత తగ్గి కిలో రూ. 90 ఉంది. అలాగే కాప్సికం కూడా కిలో రూ. 70 ఉంది. అల్లం ధర కూడా తగ్గడం లేదు. మిగిలిన కూరగాయల ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ప్రభుత్వం ధరలు తగ్గించాలి. - మహేష్, కడప

హెల్మెట్ ధరించి ప్రమాదాలను నివారించండి

– జడ్జి ప్రత్యూషకుమారి



కడప అర్బన్: వన్ కె వాక్ ర్యాలీని ప్రారంభిస్తున్న జడ్జి కె. ప్రత్యూషకుమారి

కడప అర్బన్: హెల్మెట్ ధరించి ప్రమాదాలను నివారించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ, జడ్జి కె. ప్రత్యూషకుమారి అన్నారు. గురువారం కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో 'వన్ కె వాక్' ను పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి ప్రత్యూషకుమారి మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు, పిలియన్ డ్రైవర్లు వినియోగదారులు హెల్మెట్ ఉపయోగించడంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అవగాహన కోసం 'వన్ కె వాక్' కడప నగరం ఐటీఐ సర్కిల్ నుంచి బిల్టప్ సర్కిల్ వరకు జరిగింది. హెల్మెట్ ధరించి, సురక్షితంగా గమ్యాన్ని చేరాలన్నారు. రోడ్డు భద్రతకు సంబంధించి ఎలక్ట్రానిక్ పరికరాలైన స్పీడ్ కెమెరా, తదితర టెక్నాలజీ పరికరాలను రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతకు వాడుతున్నట్లు తెలిపారు. హెల్మెట్ వాడకపోవడం చట్టరీత్యా నేరమన్నారు. హెల్మెట్ వాడి అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప తాలూకా సీఐ తిమ్మయ్య, న్యాయవాదుల సంఘం కడప అధ్యక్షుడు జి. గుర్రప్ప, సీనియర్ న్యాయవాదులు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ హరిబాబు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, కోర్టు కానిస్టేబుల్ పుల్లయ్య, పోలీస్ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్‌లు సురేష్ సహాయం, శ్రీనివాసులు, శిరీష, ఈశ్వరయ్య, దశరథరామిరెడ్డి, కోర్టు సిబ్బంది, శ్రీహరి డిగ్రీ కళాశాల విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించడం బాధ్యతగా తీసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ద్విచక్ర వాహనదారుడు ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ధరించి తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని కడప రైల్వేస్టేషన్ మేనేజర్ శేఖర్ కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి సూచనలతో కడప రైల్వేస్టేషన్‌లో హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్ మేనేజర్ మాట్లాడుతూ హెల్మెట్ ధారణపై రాష్ట్ర హైకోర్టు అటు పోలీసులు, ఇటు ప్రభుత్వానికి తగిన సూచనలు జారీ చేసిందన్నారు. ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న వారే కాకుండా వాహనంలో కూర్చొన్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాల్సి ఉంటుందన్నారు.

ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే వెయ్యి రూపాయలు జరిమానాతోపాటు మూడు నెలలపాటు లైసెన్స్‌ను సైతం రద్దు చేస్తారన్నారు. హెల్మెట్ ధరించకపోవడంతో అనేక మంది తమ ప్రాణాలను పోగొట్టుకున్న సంఘటనలు జిల్లాలో అనేకం ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేస్టేషన్ సిబ్బంది, పోలీసుల, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



కడప ఎడ్యుకేషన్ : ర్యాలీగా వస్తున్న విద్యార్థులు న్యాయశాఖ సిబ్బంది



కడప కోటిరెడ్డి సర్కిల్: హెల్మెట్ వాడకంపై రైల్వే స్టేషన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

నగరంలో అవగాహనా ర్యాలీ

కడప ఎడ్యుకేషన్: ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా హెల్మెట్‌ను ధరించి సురక్షితంగా గమ్యాలను చేరుకోవాలని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్‌లు అన్నారు. గురువారం కడప మరియాపురంలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలను నడిపేటప్పుడు హెల్మెట్ వాడటం నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు ఉంటుందన్నారు. ఈ విషయాన్ని గ్రహించి ప్రతి ఒక్కరు తప్పకుండా హెల్మెట్‌ను వాడాలన్నారు. అనంతరం కళాశాల నుంచి మారియాపురం రోడ్డు వరకు విద్యార్థులు, పారా లీగల్ వాలంటీర్లు ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తి, లెక్చరర్లు పాల్గొన్నారు.

విద్యార్థులను వేధిస్తున్న లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల మెకానిక్ మోటర్ వెహికల్ (ఎం.ఎం.వి) ట్రేడ్ లెక్చరర్ రాజశేఖర్ విద్యార్థులను వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డి.వై.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్, ఎస్.ఎఫ్.ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ రత్న రాజుకు వారు వినతిపత్రం సమర్పించి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లెక్చరర్ రాజశేఖర్ విద్యార్థులతో మద్యం తెప్పించుకోవడం, ఇంట్లోకి కూరగాయలు తెప్పించుకుంటూ వేధిస్తున్నాడ ని ఆరోపించారు. ఆ లెక్చరర్ పై అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ప్రారంభమైన ఉరుసు

పెండ్లిమర్రి : మండలంలోని కొండూరు గ్రామంలో వెలసిన మస్తాన్‌స్వామి ఉరుసు ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. మధ్యాహ్నం స్వామివారికి గంధం కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి గుండం ఏర్పాటు చేయడం , స్వామివారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. శుక్రవారం గుండం ప్రవేశం, గ్రామోత్సవం ఉంటుందన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు

పెండ్లిమర్రి : యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని ఇసుకపల్లె, ఎగువపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ కౌన్సిలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారిని సి.సాయిగ్రేస్ హజరై మాట్లాడారు. ప్రతి ఒక్క విద్యార్థి పరిశుభ్రత పాటించాలన్నారు. మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తెవాలన్నారు. కార్యక్రమంలో రిటైడ్ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గుణశేఖర్, పాఠశాల హెచ్‌ఎంలు శివమోహన్, అపర్ణ, స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించాలి

డీఈఓ మర్రెడ్డి అనురాధ

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడంతోపాటు ప్రాథమికంగా రీడింగ్, రైటింగ్ స్కిల్స్ తప్పనిసరిగా రావాలని, ఇందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ ఆదేశించారు. గురువారం కడప నగరంలోని నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్‌లో టీచ్ టూల్స్‌పై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు, సీఆర్‌ఎంటీలకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణను కోర్స్ కోఆర్డినేటర్ చల్లా విశ్వనాథరెడ్డి, హెచ్‌ఎం నాగమణి ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు చేపట్టనున్నారు. ఆంధ్ర స్కూల్ ట్రాన్స్ఫర్మేషన్ (ఎస్ఏఎల్‌టి) ప్రాజెక్ట్ నిర్వహణలో భాగంగా రాష్ట్ర విద్యా పరిశోధనా మండలి (ఎస్‌సీఈఆర్టీ), సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ టీచ్ టూల్స్ శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మర్రెడ్డి అనురాధ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ఇక్కడ పొందిన శిక్షణను తప్పనిసరిగా పాఠశాలలో అమలు చేయాలన్నారు. అలాగే ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు నైపుణ్యాలను పెంపొందించుకుంటూ మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీ పై అవగాహన పెంచుకోవాలన్నారు. తరగతి గదిలోని విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రేడులుగా విభజించుకుని, ప్రతి గ్రేడులోని విద్యార్థులను టీచర్లు దత్తత తీసుకోవాలన్నారు. ముఖ్యంగా సీ, డీ గ్రేడ్ లో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అందరికీ చదవడం, రాయడంతో పాటు కనీస విద్యా ప్రమాణాలు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి పాస్ అయ్యేవిధంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు.. అనంతరం డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి కడప మండల ఎంఈఓ గంగిరెడ్డిలు శిక్షణ పొందే ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం రిసోర్స్ పర్సన్‌లు గాయత్రి భాయ్, ఉమామహేశ్వరి, నాగమణి కుమారి, రాజేశ్వరి, మహేంద్రమ్మ లు టీచ్ టూల్ అబ్జర్వేషన్‌ను క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు సాయి, ఏఏఎంఓ రామాంజనేయులురెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ మర్రెడ్డి అనురాధ

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్నేహప్రత్యూష తెలిపారు. గురువారం ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు అధ్యక్షతన ఎన్ఎస్ఎస్-1, 2 ఆధ్వర్యంలో మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం, పరిశుభ్రత చాలా అవసరమని, ఇవి అంటు వ్యాధులు వ్యాప్తిని నివారిస్తాయన్నారు. మలేరియా, డెంగ్యూ భారిన పడిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే వ్యాధి సోకకుండా జాగ్రత్త వహించడం మేలని, ఎక్కువగా దోమకాటు ద్వారా ఈ వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుధీర, ఎన్ఎస్ఎస్ యూనిట్ -1 పీఓ శ్రీనిత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

పులివెందుల టౌన్ : పట్టణంలో మస్తాన్‌స్వామి పీరు ఉత్సవం అంకాలమ్మ గుడి ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్ ఆధ్వర్యంలో మొదటిరోజు వైభవంగా నిర్వహించారు. గురువారం జెండామాను వీధిలోని పీర్ల చావిడిలో మస్తాన్‌స్వామి పీర్లను కొలువు తీర్చి ముస్తాబు చేశారు. అనంతరం పీర్లను అగ్ని గుండ ప్రవేశం చేసి గ్రామోత్సవం నిర్వహించారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని పలు గ్రామాలలో గురువారం మొహర్రం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.పెద్దపుత్త, తప్పెట్ల తదితర గ్రామాలలో ఉదయం పీర్ల గ్రామోత్సవం నిర్వహించారు. వివిధ రకాల విన్యాసాలతో, కర్రసాములతో, నృత్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం పీర్లు ఏటికి తరలి వెళ్లాయి.

వేంపల్లెలో..

వేంపల్లె : చింతలమడుగుపల్లెలో వెలసిన ఇమామ్ఖాసీం స్వామి పీర్ల పండుగను వైభవంగా నిర్వహించారు. 18వ తేదీ స్వామి వారి ఊరేగింపు జల్దీతో మేలవాయిద్యాలతో ముగిసిందన్నారు. భారీ ఎత్తున అగ్నిగుండం వేసి అందులో ప్రజలు నడిచి తమ మొక్కులు తీర్చుకున్నారు.



వల్లూరు : పీర్ల గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

వేముల : వేములలో మొహర్రం వేడుకలు మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకున్నారు. వివిధ వేషాలు భక్తులను ఆకట్టుకున్నాయి. చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు పీర్ల పండుగకు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

లింగాలలో..

లింగాల : మండల కేంద్రంలో చిన్నమస్తాన్ స్వామి, పెద్దమస్తాన్ స్వామి, మౌలాలి స్వామీ పీర్లను ఊరేగింపు నిర్వహించారు. దిగువలింగాల, ఎగువలింగాల గ్రామాల్లో శుక్రవారం ఉదయం వరకు ఊరేగింపు కొనసాగుతుంది.



పులివెందులలో మస్తాను పీరు ఉత్సవంలో ప్రజలు



వేములలో ఊరేగింపులో భక్తులు



లింగాలలో పీర్ల ఊరేగింపు నిర్వహిస్తున్న ప్రజలు

20న ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులు తరలి రావాలి

కడప కోటిరెడ్డి సర్కిల్: తమ జీవన భృతి పెంపు విషయంగా ఉన్నతాధికారులకు తెలియజేసేందుకు ఈనెల 20వ తేదీన ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులందరూ కడపకు తరలి రావాలని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవీరెడ్డిని ఆహ్వానించామన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవీ రెడ్డి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం అమలు చేసే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత నోట్ బుక్స్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ ఆర్‌జేడీ రవి, డీవీఈఓ బండి వెంకటసుబ్బయ్య, కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్, ఇన్చార్జి ప్రిన్సిపల్, హబీబుల్లా, ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం జిల్లా కార్యదర్శి చెప్పలి రాజారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని స్పోర్ట్స్ వ్యాలీ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి, కడప ఎంఈఓ గంగిరెడ్డిలకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ షిఫ్టింగ్ అనుమతులు లేకుండా ఒక కళ్యాణ మండపంలో పాఠశాల నిర్వహిస్తూ మా పాఠశాలలో ఇంటర్నేషనల్ సిలబస్ చెప్తామని విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి వేలాది రూపాయలు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఆ పాఠశాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ నగర అధ్యక్షుడు కొండేటి హరిబాబు, సురేంద్ర పాల్గొన్నారు.

ఉపయోగం లేని యాప్‌లు రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్: బోధనకు ఆటంకం కలిగిస్తున్న యాప్‌లు, శిక్షణ కార్యక్రమాలను రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడు పాఠశాలకు వచ్చినప్పటి నుండి ముఖ ఆధారిత హాజరు, విద్యార్థుల ఆన్లైన్ హాజరు, మధ్యాహ్న భోజన పథక యాప్‌లతో పాటు మరెన్నో యాప్‌లను ఉపయోగిస్తుండడం వల్ల బోధన ప్రక్రియకు ఆటంకం కలుగుతోందన్నారు.

డ్రైనేజీ నీరు నిలవకుండా చర్యలు



మట్టితో పూడిపోయిన కాలువను మళ్లీ సరిచేసిన దృశ్యం

కడప కార్పొరేషన్: కడప నగరంలోని బైపాస్‌లో తిరుపతి రోడ్డులో రామాంజనేయపురం ఏటీఎం సమీపంలో డ్రైనేజీ కాలువలోంచి వచ్చిన నీరంతా రోడ్డుపై నిలుస్తుండేది. దీనివల్ల ప్రయాణీకులు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. ఈ సమస్యపై సాక్షి ఇటీవల 'రోడ్డుపై నిలుస్తున్న డ్రైనేజీ నీరు' శీర్షికన వార్త ప్రచురించింది. దీనిపై స్పందించిన నగరపాలక అధికారులు కాలువలోని పూడిక తొలగించి, మట్టితో పూడిపోయిన కాలువను సరిచేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సంగతుల వెనుక శాస్త్రీయత తెలియాలి



మ్యాజిక్‌ను ప్రదర్శిస్తున్న మెజిషియన్లు

కడప కల్చరల్ : రోజువారి జీవితంలో ఎన్నో సంగతులు తెలుసుకుంటామని, వాటి వెనుకగల శాస్త్రీయతను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని జన విజ్ఞాన వేదిక నగర అధ్యక్షులు శివరాం అన్నారు. గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ (మెయిన్) హైస్కూలులో సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథాన్ని గురించి అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. సభ్యులు ఇందులో శాస్త్రీయత, వాటిని గుర్తించే ప్రయోగాలు, సైన్స్ వెనుకగల అంశాలు తదితరాలను ఉదాహరణలతోసహా వివరించారు. ఈ సందర్భంగా ఒక్కొక్క సైన్స్ అంశాన్ని తీసుకుని శాస్త్రీయ కోణంలో దాన్ని విశ్లేషించారు. మ్యాజిక్‌షోలో వింత ఏమి ఉండదని, ప్రతి అంశానికి శాస్త్రీయమైన లాజిక్ తప్పక ఉంటుందని తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా మ్యాజిక్ అంశాలను తిలకించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు సునీత, అరుణ, జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న పాల్గొన్నారు.